

ఉద్రిక్తత...

- చంద్రబాబు పర్యటనలో వైసిపి నేతల నిరసనలు
- కట్టడి చేయడంలో పోలీసులు విఫలం
- ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగరంలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కర్నూలులో పర్యటించారు. వైసిపి నాయకులు అడుగడుగునా ఆటకం సృష్టిస్తూ నిరసనలు చేపట్టారు. వారిని కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. దీనిపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌర్య ఇన్ హోటల్ వద్ద టిడిపి పార్లమెంట్ స్థాయి సమీక్ష నిర్వహించారు. కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని చంద్రబాబు తెలిపారు. మాజీ కార్పొరేటర్ నాగరాజు యాదవ్ చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. సమీక్ష నిర్వహిస్తుండగా న్యాయ రాజధానికి చంద్రబాబు మద్దతు ఇవ్వాలని న్యాయవాదులు ఫ్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. టిడిపి నాయకులు కూడా 'సిఎం డౌన్ డౌన్' అంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు. పోలీసులు కట్టడి చేశారు. మధ్యాహ్నం జిల్లా టిడిపి కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ కోసం బయల్దేరగా మార్గమధ్యంలో బుధవార పేట వద్ద వైసిపి నాయకులు మారు వేషాల్లో వచ్చి చంద్రబాబు కాన్వాయిని అడ్డగించారు. రోడ్డుకు అడ్డంగా కూర్చున్నారు. పోలీసులు చెదరగొట్టారు. జిల్లా టిడిపి కార్యాలయం ముందు వైసిపి నాయకులు ఫ్లకార్డులు పట్టుకుని 'చంద్రబాబు గో బ్యాక్. రాయలసీమ ద్రోహి చంద్రబాబు' అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. టిడిపి నాయకులు పోటాపోటీగా నినాదాలు చేస్తూ ముందుకు వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు టిడిపి నాయకులను వెనక్కి పంపారు. చంద్రబాబు టిడిపి కార్యాలయం వద్దకు చేరుకుని ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆవిష్కరణ తర్వాత చంద్రబాబు మాట్లాడుతుండగా వైసిపి నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులు చూస్తూ ఊరికే నిలుచున్నారని, పోలీసులు ఎవరికి కాపలా కాస్తున్నారని ప్రశ్నించారు.

రాయలసీమ ద్రోహి జగన్

అసలైన రాయలసీమ ద్రోహి జగన్ మోహన్ రెడ్డి అని చంద్రబాబు పేర్కొన్నారు. తనను రాయలసీమ ద్రోహి అంటూ పేటీఎం బ్యాచ్ ఫ్లకార్డులు పట్టుకుని వచ్చారని, ఎవరు అసలైన రాయలసీమ ద్రోహో చెప్పేందుకు తాను సిద్ధమని తెలిపారు. ఎన్ని రాజధానులు కావాలని చంద్రబాబు అడగగా టిడిపి నాయకులు ఒకటి అనగానే 'చూడండ్రా పేటిఎం బ్యాచ్' అంటూ వైసిపి నాయకులను ఉద్దేశించి అన్నారు. అనంతరం నగరు శివారులో టిడ్కో గృహాలను పరిశీలించారు. తాము కట్టిన ఇళ్లను పనికి రాకుండా చేశారని, దుర్మార్గంగా వ్యవహరించారని తెలిపారు. టిడ్కో గృహ సముదాయం వద్ద కూడా 'గో బ్యాక్ చంద్రబాబు' అంటూ ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం కబ్జాకు గురైన బి.తాండ్రపాడు చెరువును పరిశీలించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ చేపట్టి ఆక్రమించుకున్న అక్రమ పట్టాలు రద్దు చేస్తామని తెలిపారు. చంద్రబాబు వెంట కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు



టిడిపి జిల్లా కార్యాలయం వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితి

ముక్కు మూసుకోవాల్సిందే..!

- మార్కెట్‌లో దుర్గంధం, దుర్వాసనల మధ్య రైతన్న - కాలువల్లో, రోడ్లపై మురుగు, చెత్త
- రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితం శూన్యం - నిద్రావస్థలో మార్కెట్ అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఎండనక, వాననక కష్టపడి పండించిన పంటకు అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు వస్తే కనీస సౌకర్యాలు కూడా కరువవుతున్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ప్రస్తుతం సీజన్ మొదలవడం వల్ల వేరుశనగ, ఉల్లి, ఎండుమిర్చి, ఆముదాలు, మొక్కజొన్న అధికంగా వస్తుంది. రైతులు తెచ్చిన పంటలకు రక్షణ లేకుండా పోయింది. పంట సంగతి అటుంచితే రైతులు ప్రశాంతంగా కూర్చునే వాతావరణం కూడా లేదు. దుర్వాసన, చెత్త మధ్యలో రైతులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.



కర్నూలు మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త, మురుగు

దుర్గాందానికి దుర్వాసనల మధ్య రైతన్న

పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు వచ్చిన రైతులు మార్కెట్‌లో పేరుకుపోయిన వ్యర్థ్యాల మధ్యలోనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సీజన్ మొదలవడం వల్ల వ్యర్థ్యాలు ఎక్కువయ్యాయి. సీజన్ మొదట్లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే పంట ఉత్పత్తులు పెరిగితే ఇంకెలా ఉంటుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించడం కోసం మార్కెట్ కమిటీకి చెత్తను తోలేందుకు ట్రాక్టర్‌ను డోజర్‌ను కూడా కొనుగోలు చేశారు. అయినా చెత్తను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మార్కెట్‌లో చెత్తను శుభ్రం చేసేందుకు నెలకు కూలీలకు ట్రాక్టర్‌కు డోజర్ ఖర్చులకు దాదాపు రూ.లక్షకు పైన ఖర్చు చేస్తున్న మార్కెట్‌లో చెత్త మాత్రం శుభ్రం కానీ పరిస్థితి ఉందని రైతులంటున్నారు. ఈ దుర్గంధం మధ్యనే ముక్కుకు గుడ్డలు అడ్డుపెట్టుకుని కూర్చుంటున్నామని రైతులంటున్నారు. మార్కెట్ లోని చెత్తను ఒకచోట చేర్చి అక్కడ నుండి బయటకు తరలిస్తామంటున్నారు. చెత్త గుట్టలుగా పేరుకుపోయినా తరలించే నాధుడు కర్నూలు మార్కెట్‌లో కరువయ్యారు.

లక్షలు ఖర్చు చేస్తున్న తరలించలేని చెత్త :

మార్కెట్‌లో కొన్ని నెలల క్రితం మార్కెట్ కమిషనర్ ప్రద్యుమ్న కర్నూలు మార్కెట్‌ను పరిశీలించారు. మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలని అవసరమైతే మున్సిపల్ అధికారులతో కలిసి చెత్తను పూర్తిగా ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. కానీ ఆ దిశగా మార్కెట్ అధికారులు చర్యలు తీసుకోలేదు. నెలకు రూ.లక్షకుపైనా ఖర్చు చేస్తున్నా చెత్తను మాత్రం శుభ్రం చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక ఉల్లిగడ్డ చెడిపోతే అన్ని సంచుల్లో మురుగు వస్తుందని వ్యాపారులు మురుగు వల్ల సరైన ధర రాక రైతులు బాధలు పడుతుంటే మంచి ఉల్లిగడ్డల పక్కనే ఇంత దుర్గంధం చెత్త ఉంటే ఎక్కడ ఉల్లిచెడిపోకుండా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

కాసేపు కూర్చోలేకున్నాం

- సామన్న, రైతు, సకినేనిపల్లి



మార్కెట్‌కు పంటలు తీసుకొస్తే కాసేపు కూడా కూర్చోలేని పరిస్థితి ఉంది. ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. ఇక్కడ శుభ్రం చేసి పక్కనే వదులుతున్నారు. మార్కెట్ అంతటా దుర్గంధంతో నిండి ఉంది.



చెత్త వల్ల మంచి పంట కూడా చెడిపోతుంది

- మద్దిలేటి, రైతు, ఏనుగుమర్రి

మంచిగా సరుకును రూపు చేసి తీసుకొస్తే ఇక్కడ చెత్తతో మంచిది కూడా చెడిపోతుంది. తెచ్చిన రోజు వేలం జరగకుంటే ఒకరోజు నిల్వ ఉన్న పంటకు ఈ దుర్గాంధానికి దుర్వాసనకు మురుగు వస్తుంది. అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను మార్కెట్‌లో లేకుండా శుభ్రం చేయాలి.

శుభ్రపరుస్తున్నాం

- కె.గోవిందు, మార్కెట్ కార్యదర్శి



మార్కెట్‌లోని చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. ఇంకా సీజన్ పూర్తిగా మొదలవ్వలేదు. సాధ్యమైనంత వరకు చెత్తను తరలిస్తాం.

స్టేడియాల ప్రైవేటీకరణ ఆపాలి

- పే అండ్ ప్లే రద్దు చేయాలి-డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

స్టేడియాల ప్రైవేటీకరణ ఆపాలని పే అండ్ ప్లే రద్దు చేయాలని శిక్షకులపై ఒత్తిడి తగ్గించాలని క్రీడలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ అధ్యక్షతన కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ప్రవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు సుంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టేడియాల ప్రైవేటీకరణ పే అండ్ ప్లే విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల పేద క్రీడాకారులను రోజు వ్యాయామం చేసుకునే వారికి స్టేడియాలకు దూరం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాల్సింది పోయి వారిపైన ఆర్థిక భారాన్ని మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే కర్నూలు నగరంలోని స్విమ్మింగ్ పూల్ ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ స్టేడియాలను ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేసిందని తెలిపారు. తక్షణమే స్టేడియాల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని, వ్యాయామం చేసే వారి నుండి డబ్బులు వసూలు చేయడాన్ని విరమించుకోవాలని కోరారు. కోచ్‌ల పై ఒత్తిడిని, టార్గెట్లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడలకు బడ్జెట్ కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహించాలని పెండింగులో ఉన్న వైఎస్‌ఆర్ ప్రోత్సాహక బహుమతులను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. సేల్స్ ఉద్యోగులకు టార్గెట్ ఇచ్చినట్టుగా క్రీడా శిక్షకుల టార్గెట్‌లు ఇచ్చి క్రీడాకారుల నుండి భారీగా వసూళ్లకు పాల్పడుతున్న శాప్ చైర్మన్ ప్రభాకర రెడ్డి తక్షణమే ఉపసంహరించుకోవలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు రంగప్ప, నాయకులు భరత్, వేణు, విక్రమ్, బాబి, చరణ్, రమేష్, అంజి క్రీడకారులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

పత్తి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి నివేదిక

- లంపీ స్కిన్ వ్యాధిని అరికట్టేందుకు వ్యాక్సినేషన్

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నకిలీ విత్తనాలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు వెల్లడించారు. విత్తనాలు విక్రయించే ప్రతి షాపులోనూ నాణ్యతను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. లంపీ స్కిన్ వ్యాధిని అరికట్టేందుకు వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పత్తి పంట నష్టంపై నంద్యాల ఆర్ఎఆర్ఎస్, విజయవాడ అగ్రికల్చరల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశీలించి ఇచ్చిన నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోకుండా ప్రతి షాపులోనూ నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ-క్రాప్ బుకింగ్‌కు సంబంధించి 3,42,605 మంది రైతులకు చెందిన 10,74,761 ఎకరాలకు గానూ 7,09,012 ఎకరాలను నమోదు చేశారని తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్స్‌ను సూపర్‌వైజర్ చెక్ చేసినట్లు చెప్పారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా 8,640 ఫిర్యాదులు వచ్చాయని, వీటిని తహశీల్దార్, ఎఒల ద్వారా పరిష్కరించామని తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన పప్పు శనగ, వేరుశనగ విత్తనాలను సబ్సిడీ కింద పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అధిక వర్షాల కారణంగా 936 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇందుకు సంబంధించి త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేయనుందన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆ శాఖ పీడీని ఆదేశించారు. లంపీ స్కిన్ వ్యాధిని అరికట్టేందుకు వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటివరకు 1.88 లక్షల పశువులకు గాను 1.40 లక్షల పశువులకు వ్యాక్సినేషన్ పూర్తి చేశామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. ఈనెల 21న వరల్డ్ ఫిషర్స్ డే సందర్భంగా సుంకేసుల డ్యాంలో చేప పిల్లలను వదులుతున్నామన్నారు. అనంతరం జెసి రామ సుందర్ రెడ్డి మాట్లాడారు. ఈ-క్రాప్ బుకింగ్‌కు సంబంధించి రైతులకు భౌతిక గుర్తింపు (ఫిజికల్ అక్నాలెడ్జిమెంట్) అందించినట్లు ఎఒల నుంచి నివేదికను పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న తహశీల్దార్ వివరాలను తనకు తెలిపితే, వాటిని వెంటనే ప్రాసెస్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పిఎల్.వరలక్ష్మి, ఎపిఎంఐపి పీడీ ఉమాదేవి, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ రామచంద్రయ్య పాల్గొన్నారు.



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతుందని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాద , భద్రత నివారణలో భాగంగా ఆడియో , వీడియో విజువల్స్ ద్వారా పలు ఇంజనీరింగ్ కాలేజీలలో, పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ప్రమాద నివారణలో భాగంగా ఐఆర్ఎడి లాగిన్ యాక్సిస్ సంబంధిత శాఖలకు ఇచ్చామని, అందుకు సంబంధించిన ట్రైనింగ్ కూడా ఇవ్వాలన్నారు. ఓర్వకల్ అండర్ పాస్ పనులకు సంబంధించి ప్రపోజల్స్ పంపించామని అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ 40 అధికారులు జిల్లా కలెక్టరుకు వివరించారు. సంతోష్ నగర్ వద్ద హైవే నుండి మానస దాబా వరకు హై మాస్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు తెలిపారు. టోల్ ప్లాజాస్ వద్ద వాష్ అండ్ గో ఉన్నాయా లేదా అని హైవే అధికారులను అడిగి తెలుసుకున్నారు. నంద్యాల్ చెక్‌పోస్టు, రాయలసీమ యూనివర్సిటీ వరకు ఉన్న రోడ్లో అవసరం ఉన్న చోట స్పీడ్ బ్రేకర్లు వేయించి అవసరం లేని చోట స్పీడ్ బ్రేకర్లు తీసి వేసేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. కర్నూలు నగరపాలక సంస్థ మున్సి పల్ కమిషనర్ భార్గవ్ తేజ, డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్టు కమిషనర్ శ్రీధర్, ఆర్ టిఒ రమేష్, ట్రాఫిక్ డిఎస్పీ, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లాలు అధికారులు పాల్గొన్నారు.

క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్‌కు మెమో జారీ

డిఎంఇకి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ జి .నరేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం పలు విభాగాలలో తనిఖీ చేశారు. క్యాజువాలిటీ లోని పేషంట్ల గురించి ఆరాతీశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ నిర్లక్ష్య ధోరణి పై అసహనం వ్యక్తం చేశారు. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి కుమార్ పై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. క్యాజువాలిటీ విభాగానికి సరఫరా చేసిన అధికారిక ఫోన్ పని చేయకపోవడం గురించి ఆరా తీశారు. అనంతరం డ్యూటీలో ఉన్న సిఎంఒ డాక్టర్ రవికుమార్‌ను అడిగారు. క్యాజువాలిటీ అఫీషియల్ ఫోన్ సైలెంట్ లో పెట్టి టేబుల్ డ్రా లో పెట్టుకున్నట్లు తెలిపారు. అత్యవసర విభాగానికి వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉండాల్సిన మెడికల్ ఆఫీసర్ నిర్లక్ష్యం వహించడమే కాక అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. క్యాజువాలిటీ మెడికల్‌ఆఫీసర్ సరిగా స్పందించకపోవడంపై విచారణకు ఆదేశించారు. ఆయన నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్, డిఎంఇ కి సమాచారం అందజేసినట్లు తెలిపారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర రెడ్డి, నోడల్ ఆఫీసర్ , హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగంజన్ పాల్గొన్నారు.

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.ప్రభాకర్ రెడ్డి



కర్నూలు కార్పొరేషన్ : ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ విజయవాడలో శుక్రవారం జరిగిన సమావేశంలో కె.ప్రభాకర్‌రెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్ను కున్నారు. ఆయనకు ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ హృదయపూర్వక ఉద్యమ అభివందనాలు తెలుపుతున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. కర్నూలు జిల్లాలోని అన్ని ప్రజాసంఘాల నాయకులు ప్రభాకర్‌రెడ్డికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

ఐక్య ఉద్యమాలతో ఆర్‌టిసి పరిరక్షణ

ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా ప్రథమ మహాసభలలో వక్తలు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్ : ఆర్‌టిసి సంస్థ రక్షణకు, ఉద్యోగ కార్మికుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలే శరణ్యమని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె. జిలానిబాష అన్నారు. ఎపిడిటి (ఆర్టీసీ) ఎస్‌డబ్ల్యుఎఫ్ కర్నూలు జిల్లా ప్రథమ మహాసభలు కర్నూలు లోని కార్మిక కర్షక భవనంలో శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. మహాసభ ప్రారంభంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ పతాకాన్ని ఎస్‌కె.జిలాని బాషా ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఆర్‌కె రెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభకు రాష్ట్ర కేంద్రం నుంచి ఎస్‌కె. జిలానిబాష , కోశాధికారి జె.దివాకర్ , జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు అజీమ్‌ఖాన్, భాస్కర్, జోనల్ నాయకులు విశ్వనాథ్ హాజరయ్యారు. మహాసభను జిలానిబాష ప్రారంభించారు. దేశంలోని ఆర్‌టిసి సంస్థల ప్రైవేటీకరణ చర్యలకు కేంద్రం పూనుకోగా అదే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం బలపరచడాన్ని నిరసించారు. ఆర్టీసీ సంస్థ రక్షణకు, ఉద్యోగ కార్మికుల పరిరక్షణకు ఐక్యత పోరాటాలే తక్షణ అవసరమని పేర్కొన్నారు. కోశాధికారి జె. దివాకర్ మాట్లాడుతూ 2020 , 2021వ సంవత్సరపు లీవ్ ఎన్‌క్యాష్‌మెంటును తక్షణం చెల్లించాలన్నారు. ఉద్యోగ కార్మికులకు ఇవ్వ వలసిన అన్ని రకాల టిఎ బిల్లులను అరియర్స్‌తో సహా చెల్లించాలని, ప్రైవేటీకరణ దిశగా తీసుకుంటున్న చర్యలన్ని టిని ఆపాలని డిమాండ్ చేశారు. సంస్థ రక్షణ, ఉద్యోగ కార్మికుల హక్కులను కాపాడాలని కోరుతూ మహాసభ పలు తీర్మానాలను ఆమో దించింది. అనంతరం మహాసభ నూతన కర్నూలు జిల్లా అధ్యక్షులుగా ఎన్. సత్యరాజు, కార్యదర్శిగా వి.సంజీవరాయుడు, కోశాధికారిగా ఎస్ఆర్ కె రెడ్డి తోపాటు జిల్లా ఆఫీసు బేరర్స్ గా కేసీ శేఖర్ , ఎస్ఎస్.బాషా, బిఎస్ వాసులు, మద్దిలేటి, టి.తబిత మరో 15 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కర్నూలు 1- డిపో అధ్యక్షులుగా బి.నాగరాజు, కార్యదర్శిగా ఎస్.హనుమంత రెడ్డి, కోశాధికారిగా మద్దిలేటితో పాటు మరో పదిమందితో నూతన కమిటీ ఎన్నికయింది. కర్నూల్ 2-డిపో నూతన అధ్యక్షులుగా డి.సలాం, కార్యదర్శిగా ఎ. దేవరాజు, కోశాధికారిగా ఆర్ఎల్ నాయుడు తోపాటు మరో 12 మందితో నూతన కమిటీ ఎన్నికయింది. నెల్లూరులో డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర మహాసభల సందేశాలను కార్మికులలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.



ఎస్‌డబ్ల్యుఎఫ్ మహాసభలలో మాట్లాడుతున్న దివాకర్

వీధి రౌడీలా వ్యవహరిస్తే ఊరుకోం

-సానుభూతి కోసమే బాబు కుట్ర రాజకీయాలు

-దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

-కర్నూలు ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్, మేయర్ బివై రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

చంద్రబాబు కర్నూలు రాక సందర్భంగా వీధి రౌడీల వ్యవహరించారని అలా చేస్తే ఊరుకునేది లేదని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీస్ ఖాన్, మేయర్ బివై.రామయ్య అన్నారు. శుక్రవారం కర్నూలు బిర్లా కాంపౌండ్ లోని వైసిపి జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యంత వెనుకపాటి తనానికి గురైన రాయలసీమ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా శ్రీ భాగ్ ఒప్పందం ప్రకారం కమిషన్ ఏర్పాటు, యూనివర్సిటీల ఏర్పాటు మౌలిక సదుపాయాల కల్పన ద్వారా అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పారన్నారు. దీన్ని చంద్రబాబు నాయుడు వ్యతిరేకిస్తూ ప్రచారం చేయడమే కాకుండా కర్నూలుకు వచ్చి వీధిరౌడీలా వ్యవహరించారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఏ రోజు ఇలా వ్యవహరించలేదన్నారు. సమగ్ర అభివృద్ధి కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, లాయర్లు, ప్రజాసంఘాల నాయకులను కర్రలు, రాళ్లతో దాడికి పూనుకొని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. వారిని పేటియం బ్యాచ్ అని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. అమరావతి సిండికేట్ రైతుల కోసం స్వలాభం కోసం ఈ స్కెచ్చు వేశారన్నారు. రాయలసీమ ప్రతిష్టను బద్నాం చేస్తున్నారని చెప్పారు. జిల్లా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. చంద్రబాబు తన హయాంలో 600 హామీలను కర్నూలుకు 40కి పైగా హామీలు ఇచ్చి ఏం నెరవేర్చావని ప్రశ్నించారు. జన్మలో అసెంబ్లీలో అడుగుపెట్టలేవని చెప్పారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ ప్రస్థానంలో బాబు చేయలేని పనులను జగన్మోహన్ రెడ్డి చేశారన్నారు. 2014లోనే టిడిపికి సమాధి కట్టామని గుర్తుంచుకోవాలన్నారు. సీమలో తింటే ఇక్కడ ఎందుకు బస చేయలేదని, ఉంటే సంగతేంటో తేల్చే వాళ్ళమన్నారు. గతంలో మద్రాసు, హైదరాబాదు నుంచి పలుమార్లు సీమ వాసులను తరిమేశారని, తిరిగి అది పునరావృతం కాకూడదంటే సమగ్రాభివృద్ధి తప్పనిసరి అని అన్నారు చంద్రబాబు పాలనలో తాను ఇస్తానన్న బెంచి గాని సంచి గాని ఏది లేదన్నారు. కుట్ర రాజకీయాలను మానుకోవాలని లేదంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, నగర అధ్యక్షులు సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ.హాఫీజ్‌ఖాన్ , మేయర్, డిప్యూటి మేయర్

వలస కూలీల పిల్లల కోసం సీజనల్ హాస్టళ్లు

ఎపిడి వేణుగోపాల్

ప్రజాశక్తి-తుగ్గలి :



గ్రామాలలో వలస వెళ్లిన కూలీల పిల్లల కోసమే సీజనల్ హాస్టళ్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని పెండేకల్లు గ్రామానికి మంజూరైన సీజనల్ హాస్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తుగ్గలి మండలానికి 17 సీజనల్ హాస్టల్లు మంజూరు అయ్యాయన్నారు. కేవలం వలస కూలీల పిల్లల కోసమే ఈ హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాలలో ఏ ఒక్క కూలి వలస వెళ్లినా వారి పిల్లల బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. పిల్లలు బాగా చదివి ఉన్నత చదువులకు వెళ్లాలని, మధ్యలోనే బడి మానకూడదని తపనతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కోఆర్డినేటర్ శ్రీనివాసులు, మండల విద్యాధికారి రామ వెంకటేశ్వర్లు గౌడ్, సొసైటీ చైర్మన్ అట్లా గోపాల్ రెడ్డి, వైసిపి నాయకులు తువ్వ దొడ్డి ప్రేమనాథరెడ్డి, సర్పంచు నీలావతి, ఎంపిటిసి రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ళు కట్టుకోలేని వారికీ నోటీసులు

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని బురాన్ దొడ్డి, బైతోలి, కృష్ణదొడ్డి గ్రామాలలో జగనన్న ఇళ్ళు నిర్మించుకోలేని నిరుపేదలకు హౌసింగ్ ఎఇ సుమంత్ శుక్రవారం నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1711 జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు అందుకున్నారని అందులో 75శాతం మంది అయిష్టంగా ఉన్నారని తెలిపారు. ఇదే బురాన్ పంచాయతీ ప్రజలకు బైతోలి వంక దగ్గర 41 మందికి పట్టాలివ్వగా అందులో 9 మంది మాత్రమే ఆసక్తిగా ఉన్నారని మిగిలిన 32 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. గడువులోపు కట్టించుకోలేదో పట్టాలు రద్దు పరచి మరొకరికీ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రంగన్న,నాగేష్ ఉన్నారు.

కొత్తకోటలో అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి సి బెళగల్

మండలంలోని కొత్తకోటలో పలు అభివృద్ధి పనులకు సర్పంచి శ్రీనివాసులు శుక్రవారం భూమీపూజ కార్యక్రమం చేపట్టారు. రైతు భరోసాకు రూ.20 లక్షలు, హెల్త్ క్లినిక్‌కు 17 లక్షలు, నాడు నేడు పనులకు స్పెషల్ స్కూలుకు 17 లక్షలు, రెగ్యులర్ స్కూలు కు రూ.20 లక్షలు ఇలా అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో పూజలు చేపట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచి

మండలాభివృద్ధికి రూ.40.22 కోట్లు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి శ్రీవిద్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీవిద్య

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలాభివృద్ధికి రూ.40.22 కోట్లు విడుదలయ్యాయని, అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపిపి శ్రీవిద్య కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పెద్దకడబూరు మండలాభివృద్ధికి ఆదోని ఏరియా అథారిటీ కింద రూ.40.22 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఈ నిధులతో మండలంలోని ఆయా గ్రామాల్లో లింక్ రోడ్లు, బిటి రోడ్లు, సిసి రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, వచ్చే మార్చిలోపు పనులు మొదలు పెడతామని స్పష్టం చేశారు. మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సహకారం అందజేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వలసల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వలసల నివారణకు ఉపాధి హామీ సిబ్బంది ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి వలసలను నివారించాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న యువతకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించాలని కోరారు. రోడ్ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జడ్‌పిటిసి రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు పరమేష్ గౌడ్, ఇరాన్ దేశాయి, కోఆప్షన్ సభ్యులు షేర్ ఖాన్ పటేల్, ఎంపిడిఒ వెంకటరమణప్ప, ఎఒ వరప్రసాద్, తహశీల్దార్ వీరేందర్ గౌడ్, ఎఇ మల్లయ్య, వేణుగోపాల్, సాయికుమార్ పాల్గొన్నారు.

పార్కుల్లో మౌలిక సదుపాయాలు

- పార్కును పరిశీలించిన కమిషనర్



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహావీర్ కాలనీలో పార్కును కౌన్సిలర్ సందీప్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పార్కులో మొక్కల పెంపకం చేపట్టి పచ్చదనం ఉట్టిపడేలా ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యాయామం చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్ర సామగ్రిని పరిశీలించామని చెప్పారు. నీటి సౌకర్యం కోసం బోరు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయిస్తామన్నారు. సందర్శకులకు ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా పచ్చదనం పెంపొందిస్తామని తెలిపారు.

రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలి

- జడ్‌పిటిసి ఏరూర్ శేఖర్, ఎంపిపి శ్రీరాములు



పోటీలను ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి, ఎంపిపి, ఎంఇఒ

ప్రజాశక్తి-ఆలూరు

క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, ఎంపిపి శ్రీరాములు, ఎంఇఒ కోమల దేవి ఆకాంక్షించారు. శుక్రవారం ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జగనన్న క్రీడా సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని, గెలుపొందిన క్రీడాకారులకు రూ.50 లక్షల మేర ప్రోత్సాహకాలు అందిస్తారని చెప్పారు. ఉప సర్పంచి రవి, మండల కోఆప్షన్ సభ్యులు బాషా, వైసిపి నాయకులు శ్రీధర్, జీరగౌడ్, పిఇటిలు కవిరాజు, చిన్నబాబు, హనుమంతు, విష్ణు, శేఖర్, కిశోర్, పరమేష్, ఈరన్న, రామాంజి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా డ్రమ్స్ వాయిస్తూ గుండెపోటుకు గురై మృతి చెందిన చిన్న నరసన్న కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చిన్న నరసన్న మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు టిడిపి తరపున రూ.5 లక్షలు అందజేయనున్నట్లు చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

అత్యవసర సేవలపై అవగాహన

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని జె.హోసల్లి గ్రామంలో ఎంపిపి కన్నడ స్కూల్‌లో విద్యార్థులకు అత్యవసర సేవలపై శుక్రవారం మహిళా పోలీసు వాణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మంచి, చెడు ప్రవర్తన, దిశా యాప్, కన్సిడెంట్ రితం యాప్, అత్యవసర ఫోన్ నెంబర్లు 100, 112ను ఏ సందర్భంలో ఎప్పుడు, ఎలా ఉపయోగించాలో వివరించారు. వాహనదారులు పెండింగ్‌లో ఉన్న

శాస్త్రీయ దృక్పథం నెలకొల్పడమే జెవివి లక్ష్యం

- విద్యార్థులు సైన్స్ భావజాలాన్ని పెంపొందించుకోవాలి - మండల స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమాజంలో శాస్త్రీయ దృక్పథం నెలకొల్పడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని పట్టణానికి చెందిన ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జెవివి జిల్లా అధ్యక్షులు శంకరయ్య, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక కుర్ని కల్యాణ మండపంలో వివిధ మండలాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విభాగాల్లో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు సైన్స్ భావజాలాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. సూర్య, చంద్ర గ్రహాలు ఎలా ఏర్పడతాయి, వాటిపై సమాజంలో ఉన్న అపోహలను విద్యార్థులకు వివరించారు. వాస్తవికత, మూఢచారాల మధ్య తేడాలను వివరించారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రయివేట్ స్కూల్ విభాగంలో కస్తూరి స్కూల్ విద్యార్థులు మొదటి ర్యాంకు సాధించారు. రెండో ర్యాంకు గుడ్ షెఫర్డ్ విద్యార్థులు, మూడో ర్యాంకు విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు సాధించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విభాగంలో నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నందవరం మండలంలో, ఎమ్మిగనూరు మండలంలో పట్టణానికి చెందిన విద్యార్థులు మొదటి, రెండు ర్యాంకులు సాధించారు. వీరికి ప్రజా వైద్యులు మాలకొండయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి సర్టిఫికెట్లను అందజేశారు. ముగతి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, ఉపాధ్యాయులు రామలక్ష్మీ, భారతి, నారాయణ, బిజి.మాదన్న, ఆంజనేయులు, తిమ్మప్ప, ఖాదర్ బాష పాల్గొన్నారు.



చెకుముఖి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు



ఎస్ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న ఇఇ

స్వచ్ఛమైన తాగునీరందించాలి

- ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ శివ శంకర్ బాబు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిధిలోని గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ శివ శంకర్ బాబు, డిఇ శివ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వారు ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. ట్యాంకులో నీటిమట్టం, ఫిల్టర్ బెడ్లను, పంపింగ్ మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, స్థానిక సర్పంచి పాల్ దినకరన్ సహకారంతో నీటి సమస్య రాకుండా చూస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు నీటిమట్టాన్ని పరిశీలించి నీటి నిల్వను ఉండేలా చూస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయడానికి ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎఇ నాగ మల్లయ్య, సర్పంచి పాల్ దినకరన్, పాండవగల్లు గిడ్డయ్య పాల్గొన్నారు.

'జగనన్న' ఇళ్లు నిర్మించి ఇస్తాం

- హౌసింగ్ డిఇ కృష్ణయ్య

ప్రజాశక్తి - కౌతాళం

జగనన్న కాలనీల్లో ఇళ్లను నిర్మించి ఇస్తామని హౌసింగ్ డిఇ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయం ఎమ్మెల్యే కృషితో ఇళ్ల నిర్మాణానికి జెఎన్ఆర్ కంపెనీ ముందుకు వచ్చిందని తెలిపారు. జగనన్న లేఅవుట్ కాలనీల్లో లబ్ధిదారులు రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్, పట్టా జిరాక్స్ కాపీలను ఇవ్వాలని కోరారు. మండలంలో 1,047 ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్పుడే ప్రభుత్వ ఆశయం కూడా నెరవేరుతుందన్నారు. వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డిఇ కృష్ణయ్య

భవన నిర్మాణాల వేగవంతానికి సహకరిస్తాం

- గుమ్మనూరు సర్పంచి లక్ష్మీదేవి



వైఎస్ఆర్ క్లినిక్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచి తనయుడు నారాయణ, పరిపాలన అధికారి సుధాకర్

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామంలోని ప్రజలందరికీ వైద్య సదుపాయం దగ్గర్లోనే ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ క్లినిక్ నిర్మాణాలు చేపట్టిందని, ప్రతి సర్పంచి నిర్మాణాలు పూర్తి కావడానికి సహకరించుకోవాలని సర్పంచి లక్ష్మీదేవి, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, పరిపాలనాధికారి సుధాకర్ రాజు తెలిపారు. శుక్రవారం గుమ్మనూరు గ్రామంలో సర్పంచి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం నిర్మాణం, వైఎస్ఆర్ క్లినిక్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత ఉండేలా చూసుకోవాలని సంబంధిత కాంట్రాక్టుదారులకు సూచించారు.

వైఎస్ఆర్ పథకాలకు బాబు బోర్డులు

- ఎర్రకోట కుటుంబం గురించి చంద్రబాబుకు ఏం తెలుసు

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి చేపట్టిన పథకాలకు బాబు బోర్డులు పెట్టుకోవడం పరిపాటిగా మారిందని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి విమర్శించారు. ఎర్రకోట కుటుంబం గురించి చంద్రబాబుకు ఏం తెలుసని ప్రశ్నించారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు దౌర్జన్యాలకు ఇక్కడ ఎవరూ భయపడరని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు దోపిడీ చేస్తున్నారని, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించడం ఆయన ఓ పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ చేపట్టిన జలయజ్ఞం కార్యక్రమాలన్నీ విజయవంతంగా ముగిశాయని, వాటికి చంద్రబాబు నాయుడు బోర్డులు వేసుకోవడం పొరపాటిగా మార్చుకున్నారని తెలిపారు. ఎర్రకోట కుటుంబంలో ఎవరూ అక్రమార్కులు, దోపిడీ దారులు లేదని చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి ఎమ్మిగనూరుకు చంద్రబాబు చేసిందేమీ లేదని విమర్శించారు. టెక్స్‌టైల్ పార్క్ అంటూ, చేనేత క్లస్టర్‌లంటూ ఎమ్మిగనూరు చేనేతలను బీవీ.మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు చివరకు బీవీ.కుమారుడు జయ నాగేశ్వర్ రెడ్డి కూడా మోసం చేయడం తగదన్నారు. టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కోసం అనుకూలంగా లేని స్థలంలో ఎలా ఏర్పాటు చేస్తారని, ఇది చేనేతలను మభ్య పెట్టడం కాదా అని ప్రశ్నించారు. వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, పట్టణ ప్రధాన కార్యదర్శి యుకె.వీరేంద్ర, మైనార్టీ నాయకులు రియాజ్ అహ్మద్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యుకె.రాజశేఖర్, కైరవాడి బందె, పార్లపల్లి న్యాయవాది జయన్న పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

బాబు పర్యటనతో మరింత జోష్

- టిడిపి సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరె భాస్కర్ రెడ్డి



ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గ ప్రజలందరీ సహకారంతోనే బాబు పర్యటన సక్సెస్ అయిందని, టిడిపి కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగిందని టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరె భాస్కర్ రెడ్డి తెలిపారు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్కువ సమయంలోనే పర్యటన ఖరారయినా అందరి సహకారంతో విజయవంతం అయిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ షోకు ప్రజలు తరలి రావడంతో అధినేత చంద్రబాబు నాయుడు జనాన్ని ఉద్దేశించి ప్రశంసించడం హర్షణీయమని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించి సహకరించారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎవరూ ఊహించని విధంగా ఆదోనిలో చంద్రబాబు రోడ్ షో విజయవంతం అయిందని, ఈ పర్యటన పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు పార్టీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆశయానికి అనుగుణంగా పనిచేసి నియోజవర్గంలో పార్టీ విజయానికి పాటుపడదామని తెలిపారు.

నేడు స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు

- ఎంపిడిఒ వెంకటరమణప్ప

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని నిరుద్యోగ యువత కోసం 'స్వయం ఉపాధి'పై పెద్దకడుబూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వెంకటరమణప్ప శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయం-2ను ఇటీవల కలెక్టర్ కోటేశ్వరరావు సందర్శించారని తెలిపారు. గ్రామాల్లో చదువుకున్న నిరుద్యోగులు అధికంగా ఉన్నారని, వారికి చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి చేసుకోవడానికి మండలంలో అవగాహన కార్యక్రమం ఇస్తే బాగుంటుందని విలేకరులు అడిగారని చెప్పారు. స్పందించిన కలెక్టర్ ఈనెల 19న అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని ఆదేశించారని తెలిపారు. గ్రామాల్లో చదువుకున్న విద్యార్థులు, నిరుద్యోగులు సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఏ పరిశ్రమకు, స్వయం ఉపాధి ఏమేమి ఉన్నాయని, దానికి సంబంధించిన విద్యార్హతలు, శిక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఉపాధి సిబ్బంది నిరుద్యోగులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సదస్సుకు డ్వామా పీడీ హాజరవుతారని చెప్పారు.

న్యాయవాది ఆశీర్వాదం మృతి

ప్రజాశక్తి - ఆదోని



కర్నూలు నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక న్యాయవాది ఆశీర్వాదం మృతి చెందారని ఆదోని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రయ్య శుక్రవారం తెలిపారు. గత వారంలో బైక్‌పై వెళ్తూ కిందపడి గాయాలపాలయ్యారన్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. కోలుకోలేక శుక్రవారం ఉదయం మృతి చెందారని చెప్పారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. ఆశీర్వాదం మృతికి అసోసియేషన్ తరపున సంతాపం తెలియజేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరుకు సిద్ధం

- యుటిఎఫ్ ఆధ్వర్యంలో గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు సత్వరమే చెల్లించాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేపట్టే ఆందోళనకు సంసిద్ధం కావాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, డిఎ అరియర్స్, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్డ్ ఉపాధ్యాయుల జిపిఎఫ్ బకాయిలు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా మార్చి 2022 నాటికి అన్ని బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలో ఎలాంటి పురోగతి లేదన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపుల కోసం ఆందోళన బాట పడుతున్నామని చెప్పారు. దీర్ఘకాలికమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు లచ్చప్ప, రాముడు, ప్రసాద్, శాంతమూర్తి, భోజరాజ, సూర్యనారాయణ శెట్టి, రామిరెడ్డి, మద్దయ్య, రామకృష్ణ, ధర్మన్న, సత్యన్న, వెంకటేశ్వర్లు, మేరీ, విజయలక్ష్మి, నసీమున్నీసా, లక్ష్మీకళ, సూర్యనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని మదిరే పాఠశాల ఆవరణలో గోడపత్రికను విడుదల చేశారు. యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ నారాయణ, సీనియర్ నాయకులు రామాంజనేయులు, మండల అధ్యక్షులు సుధాకర్, యుటిఎఫ్ నాయకులు రంగనాయకులు, శ్రీకాంత్, మల్లికార్జున, సుధాకర్, అరుణ, నీలమ్మ, శ్యామల యువరాజ్, మహానంది ఉన్నారు.



ఎమ్మిగనూరులో కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు



ఆదోనిలో గోడపత్రికను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

పోలీసు పెనాల్టీ నిలిపేయాలి

- సిఐటియు మండల కన్వీనర్ రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆటో కార్మికులపై పోలీసు పెనాల్టీ నిలుపుదల చేయాలని, జిఒ 21 రద్దు కోసం కార్మికులు ఉద్యమించాలని సిఐటియు మండల కన్వీనర్ బి.రాముడు, ఆటో యూనియన్ కార్యదర్శి బి.రాజు కోరారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో మాలపల్లి, నందవరం, మంత్రాలయం ఆటో స్టాండ్‌ల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి చూపకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఆటో కార్మికులు ఆటో తోలుకొని జీవనం కొనసాగిస్తుంటే పోలీసులు విచ్చలవిడిగా జరిమానాలు వేస్తున్నారని తెలిపారు. రాముడు, యోహాన్, తిమ్మన్న, ముని, నాగరాజు, స్వామి, రఫీక్, ఆదాం, ప్రకాశం, గోవిందు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ఆదోని : తెల్లవారుజామున చలికి వణుకుతూ ఆదోని రైల్వే ప్లాట్‌ఫారంపై పడుకొని ఉన్న 50 మంది నిరుపేదలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రతేడాది నిర్వహిస్తున్నట్లు జిల్లా ఛైర్మన్లు గోపినాథ్, ప్రసాదరావు తెలిపారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు. క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి వెంకటేష్ బాబు పాల్గన్నారు.

బాధిత కుటుంబానికి నారాయణ పరామర్శ

చిప్పగిరి : మండలంలోని కుందనగుర్తి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్ తండ్రి నెట్టికల్లు (64) గురువారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ కుందనగుర్తి గ్రామానికి వెళ్లి నెట్టికల్లు మృతదేహానికి పూలమాల వేసి కుటుంబానికి సంతాపం తెలిపారు. వైసిపి నాయకులు కొండా శేఖర్, ఈశ్వరయ్య, శ్రీధర్, అజయ్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తాం

- ఎంపిపి నసురుద్దీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గ్రామాలతో పాటు నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాల కల్పిస్తామని ఎంపిపి నసురుద్దీన్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాలతో పాటు జగనన్న కాలనీల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్‌లాంటి సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలో ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీరు అందించే లక్ష్యంతో జలజీవన్ మిషన్ కింద గోనెగండ్ల, వెముగోడు, తిప్పనూరు, కున్నూరు గ్రామాలు ఎంపికయ్యాయని చెప్పారు. జగనన్న కాలనీల నాలుగు లేఅవుట్లు రూ.29 లక్షలతో, గోనెగండ్ల భారత్ గ్యాస్ గోడౌను లేఅవుట్ రూ.28 లక్షలతో, కస్తూర్బా గాంధీ లేఅవుట్ ఐరన్ బండ రూ.2.3 లక్షలతో, కున్నూరు రూ.2.5 లక్షలతో ఈ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. అనంతరం శాఖల వారీగా అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఇఒఆర్‌డి నగేష్, మాజీ కో ఆప్షన్ సభ్యులు బందే నవాజ్, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, ఎర్రబాడు కాశిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రవూఫ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాల్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-ఆలూరు

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో మొలగవల్లి జడ్‌పి హై స్కూల్, ఆలూరు మోడల్ స్కూల్ విద్యార్థులకు 'మాదక ద్రవ్యాల వినియోగం - విద్యార్థులపై దుష్ప్రభావం' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి భాస్కర్ మాట్లాడారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల గురించి, నూతన అంశాలు తెలుసుకోవాలంటే గ్రంథాలయాల ద్వారానే సాధ్యమని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆలూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వీరేష్, మొలగవల్లి జడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయులు మధు బాబు పాల్గొన్నారు. **చిప్పగిరి** గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, ఉపాధ్యాయులు రంగనాయకులు, పూల రామాంజనేయులు పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**లోని స్త్రీ శక్తి భవనంలో మండల గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి అధ్యక్షతన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి హాజరయ్యారు. మండల నాయకులు ఎన్.నరసింహులు, ఎంపిపి ఈరన్న, మండల కన్వీనర్ బెట్టనగౌడ్, మాణిక్య రాజు, కాంట్రాక్టర్ బసిరెడ్డి, ప్రిన్సిపల్ పుష్పలత పాల్గొన్నారు. **ఆస్పరి** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుజాత ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలతో పాటు గ్రంథాలయాల అభివృద్ధి, ప్రజల పాత్ర అనే అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈనెల 20న ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. **కౌతాళం**లోనికన్నడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, నృత్య పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి మధు లీల మాట్లాడారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.



కోసిగిలో బహుమతులు అందజేస్తున్న మురళీమోహన్‌రెడ్డి



ఆలూరులో...



చిప్పగిరిలో...



కౌతాళంలో..





మున్సిపల్ కార్యాలయం ఎదుట క్లాప్ డ్రైవర్ల రాస్తారోకో

తెగుళ్ల నివారణకు అవగాహన కల్పించాలి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి
- అనుమానాస్పద ఖాతాల్లోనూ రైతులకు ఇన్సూరెన్స్
- రైతు బృందాలకు అందుబాటులోనున్న డ్రోన్లు



జిల్లా వ్యవసాయ సలహా మండలిలో మాట్లాడుతున్న వంగాల భరత్ కుమార్ రెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో సాగవుతున్న పంటలు తెగుళ్లకు గురి కాకుండా నివారణ చర్యలు చేపట్టే పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ అధికారులకు జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, మార్క్ఫెడ్ చైర్మన్ పి. పి. నాగిరెడ్డి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అధికంగా సాగవుతున్న వాణిజ్య పంట మిరప ఉత్పత్తులకు నల్ల తామర, ఇతర తెగుళ్ళకు గురికాకుండా నివారణ యాజమాన్య పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ అధికారులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనకులను సూచించారు. గతంలో ఇన్సూరెన్స్ ప్రీమియం పొందని అనుమానాస్పద ఖాతాల్లో ఉన్న రైతులకు కూడా ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రభుత్వం అందజేస్తుందని, ఈ మేరకు వ్యవసాయ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కొర్ర, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా గాలులకు దెబ్బతిన్న అరటి పంటలకు కూడా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రైతులందరికీ సబ్సిడీపై తార్పాలిన్లు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను సూచించారు. పెరిగిన కూలీల ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మండలానికి మూడు డ్రోన్ లను మంజూరు చేసిందని రైతులు బృందాలుగా ఏర్పాటై డ్రోన్ లు వినియోగించుకోనందుకు జిల్లాకు వచ్చిన 84 డ్రోన్ లను రైతులకు అందుబాటులో వచ్చి తగు సూచనలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను సూచించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల వలన జిల్లాలో 94 మంది రైతులకు సంబంధించి 154 ఎకరాల్లో 80 శాతం మేర దెబ్బతిన్న పత్తి పంట వివరాలను సేకరించి సంబంధిత పరిహార చర్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. లంపి స్కిన్ వ్యాధి వల్ల చనిపోయిన పశుసంపద కుటుంబాలకు ఆర్థిక సహాయం పంపిణీకి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జెడి పశు సంవర్ధక శాఖ జెడిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మిరప పంటను కొత్తగా ఆశిస్తున్న నల్ల తామర పురుగు యాజమాన్య పద్ధతులపై ముద్రించిన కరపత్రాన్ని, గోడ పత్రికను జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్, జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి తదితరులు ఆవిష్కరించారు.

వేతనాలు ఇచ్చే వరకు ఆటోలను తీసే ప్రసక్తే లేదు

మున్సిపల్ కార్యాలయం ఎదుట క్లాప్ డ్రైవర్లు రాస్తారోకో

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేసి, పెండింగ్ వేతనాలను విడుదల చేసే వరకు ఆటోలను తీసే ప్రసక్తే లేదని క్లాప్ ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం నాడు మున్సిపల్ కార్యాలయం ముందు ఆటోలను నిలిపి మున్సిపల్ కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, కార్యదర్శి కె.మహమ్మద్ గౌస్ తోపాటు క్లాప్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వేతనాలు చెల్లించాలని కోరితే ఆటోలను తీసుకువెళ్తామని ఉద్యోగాల నుండి తొలగిస్తామని రెడ్డి ఏజెన్సీకి చెందిన జనరల్ మేనేజర్ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనరల్ మేనేజర్ చర్యలు దుర్మార్గంగా ఉన్నాయన్నారు. నంద్యాల పట్టణాన్ని క్లీన్ గా ఉంచాలనే చిత్తశుద్ధి ఉంటే క్లీన్ గా ఉంచడం కోసం కృషి చేస్తున్న డ్రైవర్ల వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సంకల్పం అనే నినాదంతో రాష్ట్రాన్ని దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని కృషి చేస్తుంటే ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నాయని విమర్శించారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు సరైన వేతనాలు చెల్లించకపోవడం, నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వలన డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10,600 చెల్లిస్తే ఆటో డ్రైవర్లకు కేవలం 8270 రూపాయల మాత్రమే చెల్లించడం జరుగుతుందని,పది నెలల అవుతున్న పిఎఫ్ అమౌంట్ ను చెల్లించడం లేదని,క్లాఫ్ ఆటో డ్రైవర్ కు ఏమైనా జరిగితే తమ కుటుంబాన్ని ఆదుకునే పరిస్థితుల్లో ఎవరూ లేరని ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్న ఏజెన్సీ వారు ఎలాంటి స్పందన ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి : పిడి



మాట్లాడుతున్న పిడి లీలావతి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

బాల్య వివాహాలు జరగకుండా నివారించాలని ఐ.సి.డి.ఎస్. పిడి లీలావతి పేర్కొన్నారు. శుక్రవారం బనగానపల్లె ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి టీచర్లకు, ఏఎన్ఎం లకు ఆరోగ్య సిబ్బంది, గ్రామ మహిళా పోలీస్ లు, బాల్య వివాహాలపై లోప పోషణ పై పరిశుభ్రతపై తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఐసీడీఎస్ పీడీ లీలావతి పాల్గొని మాట్లాడారు. గర్భవతులకు, బాలింతలకు సరైన సమయానికి ఆరోగ్యం పట్ల సూచనలు ఇవ్వాల న్నారు. బనగానపల్లె సిడిపిఓ ఉమామహేశ్వరి, ఆళ్లగడ్డ సిడిపిఓ తేజేశ్వరి, సూపర్వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సిరులు కురిపిస్తున్న.. మొక్కజొన్న పంట

ప్రజాశక్తి - సంజామల

మండలంలో మిక్కినేనిపల్లి గిద్దలూరు పేరు సోమల కొత్తూరు గ్రామాల్లోని రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట సిరులు కురిపిస్తోంది. మిక్కినేనిపల్లిలో 70 ఎకరాలు, గిద్దలూరులో 50 ఎకరాలు, పేరుసోములలో 30 ఎకరాలు, ఓత్రమాను దినేలో 20 ఎకరాలు, నట్ల కొత్తూరులో 15 ఎకరాలు మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. భూమిలో మందు, సేద్యము, కలుపులు, క్రిమిసంహారక మందులు ఎకరాకు 12 వేల రూపాయలు ఖర్చు అయిందని మిక్కినేని పల్లె రైతులు దేశాయిరెడ్డి, బాష, విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల మొక్కజొన్న వస్తుందని రైతులు తెలిపారు. కింటా ధర రూ.2000 ప్రకారం ఎకరాకు రూ.50 వేలు వస్తుందని ఖర్చు పోను ఎకరాకు 38 వేల రూపాయలు వస్తుందన్నారు. ఎకరాకు 38 వేల రూపాయలు ఆదాయం వస్తుందని రైతులు తెలిపా రు. ఇతర ఏ పంట వేసినా ఇంత ఆదాయం రాదని మిక్కినేనిపల్లి గిద్దలూరు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

ఆదాయం బాగుంది

- దేశాయ్ రెడ్డి, రైతు.



నేను ఆరు ఎకరాలలో మొక్కజొన్న పంట వేశాను. ఎకరాకు 15 వేల రూపాయలు ఖర్చయింది. ఎకరాకు 30 క్వింటాళ్లు మొక్కజొన్న పంట వస్తుంది. ఇతర పంటల కంటే మొక్కజొన్న పంటకు ఖర్చు తక్కువ. అందుకే ఖరీఫ్, రబీలో ఈ పంటను పండిస్తున్నాను.

నంద్యాలలో పర్యటించిన సహ చట్టం కమిషనర్



నంద్యాల తహశీల్దార్‌తో మాట్లాడుతున్న కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాలలోని పలు శాఖలలో సమాచార హక్కు చట్టం అమలు తీరును రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి పరిశీలించారు. శుక్రవారం నంద్యాలకు వచ్చిన ఆయన నంద్యాల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం మండలం, ఉప ఖజానా కార్యాలయం,జిల్లా రిజిస్టరు వారి కార్యాలయం,నంద్యాల 2వ పట్టణ రక్షక భట నిలయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం,జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో అమలు చేస్తున్న సమాచార హక్కు చట్టానికి సంబంధించిన రిజిస్టర్లను రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ కాకర్ల చెన్నారెడ్డి పరిశీంచారు.

రోడ్ సేఫ్టీ డ్రైవింగ్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - బేతంచర్ల

వాహనాలు నడిపే వారు రోడ్డు సేఫ్టీ నియమనిబంధనలు తప్పకుండా పాటించాలని మోటార్ వెహికల్ సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్, డాక్టర్ బిఈడి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాస్ అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలో రోడ్డు సేఫ్టీ భద్రత వంటి విషయాలపై అవగాహన సదస్సు శుక్రవారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బేతంచెర్ల ఎంపీడీవో వెంగన్న, ఈవోఆర్ డి నాయక్, హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ, మోటర్ వెహికల్ యాక్ట్ ప్రకారం ఒక మైనర్ వాహనము నడుపుతూ పట్టుపడితే ఆ పిల్లవాడి పోషకుడికి,లేదా వాహనదారుడు కి 2500 రూపాయలు ఫైన్, మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు లైసెన్సు ఒక సంవత్సరం రద్దు చేయబడు తుంద న్నారు. వాహనాలకు ఎక్కువ సౌండ్ వచ్చే హారాన్ లు పెట్టుకున్న వారికి. ఫస్ట్ టైం 1000 రూపాయలు రెండవసారి పట్టుపడితే 2000 రూపాయలు ఫైన్ ఉంటుందన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే 5000 రూపాయలు ఫైన్‌తో పాటు ఆరు నెలల నుండి 12 నెలల వరకు జైలు శిక్ష ఉంటుందని వారు తెలియజేశారు. వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోతే సెక్షన్ 196 ప్రకారం ఫస్ట్ టైం 2000 సెకండ్ టైం 4000 రూపాయలతో పాటు మూడు నెలల జైలు శిక్ష ఉంటుందని వారు అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ తప్పకుండా చేయించుకోవాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్సుల కొరకు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని సారథి డాట్ పరివహాన్ డాట్ జివో వి ఇన్ (sarathi.parivahan.gov.in) అని ఎవరి సెల్ ఫోన్‌లో వారు దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శేషన్న, ఏబీఎం లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమ్ముపాలెం శ్రీనివాస్

జగనన్న కాలనీని పరిశీలించిన ఎమ్మెల్యే



జగనన్న కాలనీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని జగనన్న కాలనీని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్తు, నీటి బోర్లు కనీసం వసతులు ప్రజలకు కల్పించాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా ఆయన మూడవరోజు గడపగడపకు కార్యక్రమం గండిపేట సిపి నగర్ కాలేజ్ బైపాస్ రోడ్లలో నిర్వహించారు. అంతకు ముందు ఆయన వెలుగోడు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో కబడ్డీ పోటీలను ప్రారంభించి రూ. 25 వేలు నగదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి క్రాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ నందు వికలాంగుల విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ట్రైనింగ్ క్లాస్ రూం, సభా వేదికను రిబ్బన్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి కాంట్రాక్టర్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, అడ్వకేట్ ఆసిఫ్ అలి ఖాన్ అధికారులు ఎంపీడీవో అమానుల్లా, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రీను, విద్యుత్ శాఖ ఏఈ రవీంద్ర నాయక్, ఎం పి పి రమేష్, సర్పంచ్ జయపాల్, వైస్ ఎంపీపీలు ఎంపీటీసీలు చికెన్ బాబు, శంకర్ నాయక్, ఎంపీటీసీ ఫ్రూట్ చాంద్, మదీనా షంషీర్,క్రాంతి వికలాంగుల పాఠశాల యాజమాన్యం జాకీర్, ఆరిఫ్ మండల నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

- జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు,ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది తమ వ్యక్తిగత హెల్త్ మెడికల్ , రిక్వెస్ట్ బదిలీలు ఇతర వ్యక్తిగత కారణాల సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జలదుర్గం హెడ్ కానిస్టేబుల్ ఎం .నగేష్ మెడికల్ గ్రౌండ్ కింద జిల్లా ఎస్పీని కలవగా బదిలీ చేస్తానని భరోసా ఇచ్చారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు అక్కడికక్కడే తగిన పరిష్కారం చూపి వారిలో భరోసా కల్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలుపెరగకుండా పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అందులో భాగంగానే పోలీస్ సిబ్బంది కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే ఆయన వెల్లడించారు.

వికలాంగుల పింఛన్ల పునఃపరిశీలన

చాగలమర్రి : మండల పరధిలోని 9 సచివాలయాలకు సంబంధించిన 386 వికలాంగుల పింఛన్లు రాష్ట్ర సెర్ప్ కార్యాలయం నుంచి పునఃపరిశీలనకు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్ వివరించారు. శుక్రవారం 27 వికలాంగుల పింఛన్ల పునఃపరిశీలనకు వచ్చాయన్నారు. పింఛన్లు అందుకుంటున్న వికలాంగులకు సరైన ధృవపత్రాలు ఉన్నాయా లేదా అని ఆధార్,సదరన్ సర్టిఫికెట్లను పరిశీలించి అవి సక్రమంగా ఉంటే లబ్ధిదారులను అర్హులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మిడుతూరు :** మండలంలోని మాస్ పేట కడుమూరుపరిధిలోని ఎంపీడీవో జియన్ రెడ్డి శుక్రవారం పెన్షన్స్ వెరిఫికేషన్‌ను పరిశీలించారు. సచివాలయంలో నేడు నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్ ను సందర్శించి, గ్రామ ప్రజలందరూ ఆధార్ సేవలను వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అస్రఫ్ బాష, కనుమూరు సర్పంచ్ జీవరత్నం, మిడుతూరు పంచాయతీ సెక్రెటరీ సుధీర్ నందకుమార్, రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డిఆర్ఓ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రెగ్యులర్ డిఆర్ఓగా బి. పుల్లయ్య తిరిగి శుక్రవారం విధుల్లో చేరారు. అనారోగ్య పరిస్థితుల రీత్యా దాదాపు రెండు నెలల పాటు వ్యక్తిగత సెలవుల్లో వెళ్లిన ఆయన, తిరిగి నంద్యాల డిఆర్ఓగా విధుల్లో చేరారు. నెలలపాటు ఇన్చార్జి డిఆర్ఓగా విధులు నిర్వహించిన మల్లికార్జునుడు కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా తన స్థానానికి వెళ్లారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చిన సిఎం జగన్ : ఎమ్మెల్యే



పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

పాద యాత్రలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం వాగ్దా నాలను అమలుపరిచిన ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మడపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని నిలువగండ్ల, జంబులదిన్నె గ్రామాలలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులయి ఉండి సంక్షేమ పథకాలు రానివారు తమ దష్టికి తెస్తే పథకాలను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మడపల్లె గ్రామ సర్పంచ్ వై వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ ,విద్యా కమిటీ చైర్మన్ మధు, నిలువగండ్ల వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, మనోహర్, నరసింహుడు, బాలుగ్రం, పుల్లయ్య, జంబులదిన్నె నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పుల్లయ్య, పెద్దమని తిమ్మయ్య ,బోయ కిట్టు, మురళి, మద్దిలేటి రెడ్డి, మండల అభివద్ధి అధికారి శివరామయ్య, మండల అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు వైసిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు : వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తొగూర్ ఆర్థర్ పేర్కొన్నారు. శుక్రవారం నందికొట్కూరు మున్సిపాలిటీలోని 18 వార్డులో కోట వీధి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఏ సంక్షేమ పథకం ఆగకుండా పేదలకు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ మున్సిపల్ వైస్ చైర్మన్, రబ్బాని, కౌన్సిలలు జాకీర్ హుస్సేన్, ధర్మారెడ్డి,తాసిల్దార్ రాజశేఖర్ బాబు, సింగిల్ విండో చైర్మన్ ఉస్సేనయ్య, తమ్మడపల్లి విక్టర్, ప్రవీణ్ కుమార్, మెప్మా అధికారి పి శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

నైజీరియా సైబర్ నేరగాళ్ల అరెస్టు

- మోసపోతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయండి

- నంద్యాల ఎస్పి రఘువీర్ రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నైజీరియాకు చెందిన సైబర్ నేరగాన్ని పోలీసులు పట్టుకున్నారు. సైబర్ నేరస్తుడిని శుక్రవారం మీడియా ముందు జిల్లా ఎస్పి కె. రఘువీర్ రెడ్డి హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎస్పి మీడియాతో వివరించారు. ఆయన మాటల్లో.... గత సెప్టెంబర్ 6న బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన జి. లక్ష్మీదేవి అనే మహిళ బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఒక గుర్తు తెలియని వ్యక్తి జున్కూక్ అనే పేరుతో పరిచయం అయి బహుమతులు పంపించాడు. వేరే మహిళ ద్వారా నమ్మకం కలిగించి కస్టమ్ ఫీజు అని కొరియర్ చార్జీలని అనేక దఫాలుగా రూ. 26,07,000లు తనఖాతాలో వేయించుకున్నాడు. ఈ పిర్యాదు మేరకు సెప్టెంబర్ 6న కేసు నమోదు చేసి ఈ కేసు దర్యాప్తులో భాగంగా డోన్ డిఎస్పి పర్యవేక్షణలో బేతంచెర్ల సిఐ జి. ప్రియతమ్ రెడ్డి, ప్యాపిలి ఎస్ఐ సిఎం. రాకేష్ వారి సిబ్బంది గురు బాబు, దస్తగిరి ఒక బందంగా ఏర్పడి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమాచారం సేకరించారు. ఆ సమాచారం మేరకు ఈ కేసులో దర్యాప్తు అధికారి ప్రియతమ్ రెడ్డి వారి బృందం ముద్దాయి 29 యేళ్ల యువకుడు ఓకేకే ఆలోసియస్ చిలేదు, ఆయన తండ్రి లేట్ ఓకేకే నైజీరియా దేశస్తుడు. ప్రస్తుతం ఉత్తమ్ నగర్ ఆనంద్ విహార్ న్యూ ఢిల్లీకి చెందిన వ్యక్తిని శుక్రవారం ఉదయం 10:30 గంటలకు హైదరాబాదు నాగోల్ చౌరస్తాలో అరెస్టు చేశారు. నైజీరియా దేశం నుండి భారతదేశానికి బతుకుదెరువు కోసమని వచ్చి న్యూ ఢిల్లీలో ఉంటున్నారు. ఇక్కడికి వచ్చినప్పుడు వారి ఫొటోస్‌ను షాదీ డాట్ కామ్, సంఘం డాట్ కామ్, జీవన్ సాతి డాట్‌కాంలలో ఉంచారు. ఫోటోలని బయోడేటాను పోస్ట్ చేస్తూ అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలతో పరిచయం పెంచుకుని డేటింగ్ చేస్తూ ఉంటారు. వారి ద్వారా వాళ్ళ రాష్ట్రాలకు చెందిన కొంతమంది వ్యక్తుల బ్యాంక్ ఖాతాబుక్కులను, ఎటిఎం కార్డులను, సిమ్ కార్డులు తెప్పించుకొని వాటి ఆధారంగా భారతదేశానికి చెందిన మహిళలను టార్గెట్ చేసుకున్నారు. సామాజిక మాధ్యమాలలో వారికి ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో కొంతమంది పురుషుల అందమైన ఫోటోలని వారి ప్రొఫైల్‌లో పెట్టి చాటింగ్ చేస్తూ వారికి నమ్మకం కుదిరే విధంగా ప్రవర్తించేవారు. వారి మొబైల్ నెంబర్లని సేకరించుకుని వాటి ద్వారా తాము ట్రాప్ చేసిన ఆడవాళ్ళతో వాట్సప్ ద్వారా చాటింగ్ చేసి పరిచయం పెంచుకుంటారు. కొన్ని రోజుల తర్వాత తన స్నేహితురాలు హీనా చెత్రి అమ్మాయి ద్వారా తాము ఎంచుకున్న మహిళలకు ఫోన్ చేయించి మీకు పరిచయం ఉన్న వ్యక్తి బహుమతులు పంపించారు. ఆ బహుమతులకు గాను కస్టమ్స్ ఫీజుల కింద అమౌంట్ కట్టవలసి ఉంటుందని మొదలు పెట్టారు. వాటి ద్వారా ముందుగానే సేకరించి పెట్టుకున్న అకౌంట్లలో డబ్బులు వేయించుకున్నారు. ఒకవేళ వ్యక్తులకు ఏదైనా అనుమానం వచ్చి వారు ప్రశ్నిస్తే పోలీస్ కేసుల పేరుతో బెదిరిస్తారు. ఇలా వచ్చిన డబ్బులలో కొంత డబ్బులు వెంటనే నైజీరియాకు పంపించుకుని మిగిలిన డబ్బును ఖర్చుల నిమిత్తం ఉంచుకుంటారు. సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన చెందిన లక్ష్మీదేవితో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా జుంకుక్ అనే పేరుతో పరిచయం పెంచుకొని ఆమెకు బహుమతులు వచ్చాయని నమ్మించి ఆమె దగ్గర ఉన్న రకరకాల బ్యాంకు ఖాతాలలో సుమారు రూ. 26 లక్షల వేయించుకున్నారు. ముద్దాయిని అరెస్టు చేసేప్పుడు అతను నేరానికి ఉపయోగించిన రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముద్దాయికి సహకరించిన అతని స్నేహితురాలు హీనాచెత్రిని ఇంకా అరెస్టు చేయాల్సి ఉంది. మహిళలు సామాజిక మాధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందిగా ఎస్పి కోరారు. అపరిచిత వ్యక్తులతో సామాజిక మాధ్యమాల్లో చాటింగ్ పేరుతో సాన్నిహిత్యం పెంచుకొని మోసపోవద్దని సూచించారు. మీరు ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లయితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కేసు నందు ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన బేతంచర్ల , ప్యాపిలి ఎస్ఐలను వారి సిబ్బంది దస్తగిరి, గురుబాబులను ఎస్పి అభినందించారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం

క్రీడా మైదానాలను, ఇండోర్ స్టేడియంల ప్రైవేటీకరణను ఆపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానాలను, ఇండోర్ స్టేడియంలను, క్రీడా వికాస కేంద్రాలను ప్రైవేటు వారికి లీజుకి ఇచ్చే నిర్ణయం ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల పట్టణంలో పద్మావతి నగర్ లోని ఇండోర్ స్టేడియం (డిఎస్ఏ) డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫీస్ ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఓ.లక్ష్మణ్, మద్దతుగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, నాయకులు ఓబులేష్, నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు సాయి డిఫెన్స్ వి .రమణ, కార్యదర్శి సిద్దార్థ్ రాజు, ట్రెజరర్ వీరేష్, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ క్రీడా మైదానాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియంలను, స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్లను, పే అండ్ ప్లే పేరుతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రైవేట్ కాంట్రాక్టర్లకు లీజుకిచ్చే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోకపోతే డివైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని, కలిసొచ్చే అన్ని సంఘాలను కలుపుకొని కార్యక్రమాలు చేస్తామని వారు తెలియజేశారు.

కుల వివక్షతోనే ఇఒపై అసత్య ప్రచారాలు : మాల మహానాడు

ప్రజాశక్తి - శ్రీశైలం

కుల వివక్షతోనే ఇఒపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య ఆరోపించారు. శ్రీశైలం లోని వాసవి -2 నందు మాల మహానాడు దోర్నాల శ్రీశైలం మండలాల ప్రెసిడెంట్ గంగు మాలవిజయ్ బాబు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జి చెన్నయ్య మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న లవన్నపై కొందరు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విమర్శలు చేస్తూ వారి ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారన్నారు. ఎస్సి సామాజిక వర్గానికి చెందిన లవన్న కార్యనిర్వాహన అధికారిగా ఉండడాన్ని అగ్రకులాలు జీర్ణించుకోలేక కేవలం కుల వివక్షతోనే లవన్నపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు కొనసాగితే జాతీయ స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన శ్రీధర్ రావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ, జెవివి నేతలు

శాస్త్ర అభివృద్ధి తోనే దేశాభివృద్ధి : జెవివి

ప్రజాశక్తి-డోన్

జనవిజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పరీక్షలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల డోన్ పాతపేటలో జనవిజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యం శెట్టి అధ్యక్షతన నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రాలను డోన్ మండల విద్యాధికారి ప్రభాకర్, పాటశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ ఆవిష్కరించారు. బహుమతి ప్రధానోత్సవంలో డాక్టర్ హుస్సేన్ పాల్గొన్నారు. హుస్సేన్ మాట్లాడుతూ శాస్త్ర అభివృద్ధి తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సైన్స్ అభివృద్ధి పెరుగుతున్నా మూఢనమ్మకాలతో సమాజం వెనుకబడి కష్టాలు పడుతున్నదన్నారు. వాటిని పారద్రోలడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. విన్నర్స్‌కు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి బచ్చు జయసీలగుప్త బహుమతులను అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వం అలవరచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జెవివి డివిజన్ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎంవి. సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, లక్ష్మయ్య, లక్ష్మీకాంత్, జివి.రమణ, రామమూర్తి పాల్గొన్నారు. పరీక్షలలో ప్రభుత్వ పాటశాలలనుండి ప్రథమబహుమతి కెజిబివి పాటశాల నుండి ఎం.నందిని గ్రూపు, ద్వితీయ బహుమతి జిల్లాపరిషత్ పాఠసాల బాలికలు కె.గీతాంజలి గ్రూపు, తృతీయబహుమతి ఎపిమాడల్ స్కూల్‌నుంచి జి.తరుణ్ గ్రూప్, ప్రయివేటు పాటశాలలో ప్రథమబహుమతి శ్రీసుధ విద్యాలయ నుండి కె.తేజస్విని గ్రూపు,ద్వితీయ బహుమతి సిబిఎస్ఇ పాటశాల నుండి పవన్ కుమార్ గ్రూపు, తృతీయ బహుమతి ఎం. కైలాస్ గ్రూపు పొందారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నాడు-నేడు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలో దామగట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జగనన్న నాడు-నేడు ఫేస్ -2 కింద మంజూరైన అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ నిర్మాణమునకు శాసనసభ్యులు తొగురు ఆర్థర్ శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం ప్రస్తుతం ఉన్న తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ, మండల తహసిల్దార్ రాజశేఖర్ బాబు, మండల అభివృద్ధి అధికారి శోభారాణి, మండల విద్యాశాఖ అధికారి ఫైజున్నిశా బేగం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ డాలు స్వాములు, బ్రాహ్మణకొట్కూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ్ రెడ్డి,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పి.ఇమ్మనుయేలు, ఎస్ఎస్‌ఏ డి. ఈ. ఈశ్వరయ్య, గ్రామ వైసిపి నాయకులు మాధవరం యేసు రత్నం, సంజన్న, రత్నం, వేల్పుల నాగన్న, వేల్పుల జయపాల్, భాగ్యరాజు, ఏసన్న, వేల్పుల జ్యోతి, నతానియేలు, బ్రాహ్మణ కొట్కూరు రఘునాథ రెడ్డి, పాఠశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి

జెవివి ఆధ్వర్యంలో చెకుముఖి పోటీలు

ప్రజాశక్తి- ప్యాపిలి

శాస్త్ర విజ్ఞానంతోనే ప్రగతి సాధ్యం మూఢ విశ్వాసాలను విడనాడి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని ప్యాపిలి ఎంపిడిఒ ఫజుల్ రెహమాన్ తెలిపారు. చెకుముకి మండల స్థాయి పరీక్షను స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నందు నిర్వహించారు. జెవివి అధ్యక్షులు సర్వజ్ఞ మూర్తి అధ్యక్షతన జరిగిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ పజల్ రహిమాన్, జెడ్పిటిసి బొరెడ్డి శ్రీరామి రెడ్డి, స్థానిక ఉప సర్పంచ్ భువనేశ్వర రెడ్డి, నాగేంద్ర, ఇంఛార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు,పూర్వ విద్యార్థి శ్రీదర్, జిల్లా కార్యదర్శి శాంతి ప్రియ,యూటీఎఫ్ సీనియర్ నాయకులు లతీఫ్ ,లక్ష్మీ నాయక్ ,వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నంద్యాల :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాల్లో భాగంగా శుక్రవారం మండల స్థాయి టాలెంట్ టెస్ట్ లను నంద్యాల డివిజన్లోని 12 మండలాల్లో, నంద్యాల పట్టణంలో పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మండలం స్థాయిలో ఫస్ట్ సెకండ్ సాధించిన టీములను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. జనవిజ్ఞానిక జిల్లా నాయకులు రామరాజు, గోపాల్, పునీత్, చిన్నయ్య, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. **ఆత్మకూర్ :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని నారాయణ విద్యా విహార్ హై స్కూల్ కరస్పాండెంట్ గంజి రాజశేఖర్, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎం జనార్దన్ రావు అన్నారు. మండల స్థాయి చెకుముఖి టాలెంట్ పరీక్షలను స్థానిక నారాయణ విద్య విహార్ హైస్కూల్ నందు నిర్వహించారు. గంజి మోహన్ కుమార్, అహ్మద్ హుస్సేన్, లక్ష్మణ్, చెన్నయ్య, ఆస్మా, హరీష్, శశికళ, పద్మజ, లక్ష్మణ్, కే రామారావు పాల్గొన్నారు. **రుద్రవరం :** జన విజ్ఞాన వేదిక ద్వారా నిర్వహించబడుతున్న జిల్లా చెకుముకి టాలెంట్ సైన్స్‌కి రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లా కోఆర్డినేటర్ రామ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ముగ్గురిని జిల్లాకి ఎంపిక చేశారు,వారిలో 10 వ తరగతి కె. వినిస్టిన్,9వ తరగతి ఏం. కీర్తన,8 వ తరగతి వై.గురు మనోహర్ లు జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారు,వారికి రామరాజు బహుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సజనాత్మక శక్తిని వెలికితీయడానికి, శాస్త్రీయ ఆలోచన, పరిశీలన, శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడానికి, శాస్త్రవేత్తలుగా ఎదగడానికి, సైన్స్ అధ్యయనాన్ని ప్రోత్సహించేందుకు సైన్స్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్ టీచర్స్ యొక్క సహకారంతో విద్యార్థులు విజయం సాధిస్తున్నారన్నారు. ఉపాధ్యాయ బృందం నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ కలిసి విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులకు బహుమతలు, సర్టిఫికేట్లు అందజేస్తున్న దృశ్యం

సగర, ఉప్పర కులానికి రాజకీయంగా పెద్దపీట : ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉప్పర సగర కులానికి రాజకీయంగా పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బనగానపల్లె మండలం సగర సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప్పరి సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికారు. అనంతరం కాటసాని రామిరెడ్డిని శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఒక ఎంపీటీసీ స్థానాన్ని , యాగంటి దేవస్థానం పాలకమండలిలో ఉప్పర కులస్తులకు చోటు కల్పించడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలని, తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ఉప్పర కులానికి చెందినవారు కాటసాని కుటుంబానికి తరతరాల నుంచి ఆత్మీయ అనురాగాలు ఉన్నాయని తెలిపారు. అందుకే మామ, బావ అంటూ వరుసలతో ఇప్పటికీ పిల్చుకుంటామని తెలిపారు. యాగంటి దేవస్థానంలో సగరసేవ సంఘం అన్నదాన సత్రానికి 25 సెంట్లు స్థలం త్వరలోనే కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో అభివృద్ధిలో భాగంగా యాగంటి పల్లె రోడ్డు నుంచి జిఎం టాకీస్ వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో సగరుల కులదైవం అయిన భగీరథుని విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గ సగర సేవా సంఘం అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, నంద్యాల సేవా సంఘం అధ్యక్షులు శివయ్య, ఆర్లగడ్డ సగర సేవా సంఘం అధ్యక్షులు రాంప్రసాద్, ఎంపిటిసి పోలూరు వెంకటసుబ్బయ్య, పోలూరి కష్ణ, కతాల తిరుపాల్ చిందుకూరి సుబ్రహ్మణ్యం, చిందుకూరి గోపాల్, శ్రీరాములు, దస్తగిరి, బాలకష్ణ, అంగడి కష్ణ, వెంకట కిరణ్, చెన్నయ్య, మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సన్మానిస్తున్న ఉప్పర సగర సంఘం నాయకులు

ఆపదలోని వారికి రక్తదానం చేయండి

- కిరణ్ వర్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలని ఢిల్లీకి చెందిన కిరణ్ వర్మ అన్నారు. రక్తదానంపై అవగాహన సదస్సును రెడ్ క్రాస్ సభ్యులు వలి, కిరణ్ వర్మ రెడ్ క్రాస్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఢిల్లీకి చెందిన కిరణ్ వర్మ గత సంవత్సరం డిసెంబర్20న తిరువనంతపురం నుండి దేశవ్యాప్తంగా రక్త దానం పై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పాదయాత్ర చేస్తున్న కిరణ్ వర్మ వాక్ బ్లడ్ 2100 కిలోమిటర్స్ శుక్రవారం కొలిమిగుండ్ల చేరుకుంది. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన కల్పించారు. అనంతరం కిరణ్ వర్మను ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్ క్రాస్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, రెడ్ క్రాస్ సీనియర్ నాయకులు, మానవతా కన్వీనర్ పేరు సోముల, నరసింహమూర్తి, రెడ్ క్రాస్ సభ్యులు గురు మోహన్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు సమీపంలోని పాలకేంద్రం వద్ద కేజీ రోడ్డుపై మోటార్ సైకిల్ ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల మేరకు వేంపెంట గ్రామానికి చెందిన అజయ్ కృష్ణ శుక్రవారం కర్నూల్ నుండి ఆత్మకూరుకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వెలుగోడు మండలం భోగిరేవుల గ్రామం నుంచి జూపాడు బంగ్లా మండలం పారుమంచాలకు వెళుతున్న ఆటో మోటార్ సైకిల్ ఢీకొనడంతో అజయ్ కృష్ణకు కాలు విరిగి మోకాలి దగ్గర ఎముక బయటికి వెళ్లి తీవ్ర గాయం అయ్యింది. సంఘటన స్థలానికి హెడ్ కానిస్టేబుల్ ఎర్రన్న చేరుకొని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కర్నూల్ వైద్యశాలకు తరలించారు.

నేడు ఎమ్మెల్యే రాక

బండి ఆత్మకూర్ : శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని కడమల కాలువ గ్రామానికి వస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

యాగంటి పల్లె శివాలయంలో చోరీ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటి పల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయంలో చోరీ జరిగినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు శివాలయంలోనికి ప్రవేశించి రూ 10వేల విలువ చేసే వస్తువులు, శివాలయ సమీపంలోని కిరాణం షాప్ లో రూ10వేల నగదు దొంగలించినట్లు ఆలయ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెచ్చెరువు చెంచుగూడెంలో గిరిజనులకు వైద్య సేవలు

ఆత్మకూర్ : నల్లమల అడవిలోని పెచ్చెరువు చెంచుగూడెంలో శుక్రవారం నాడు గిరిజనులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ గోపాల్ నాయక్ మాట్లాడుతూ చిన్నపాటి జబ్బులు వచ్చినప్పటికీ డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. పిహెచ్‌సి పరిధిలో గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే గంగుల నాని

కనకదుర్గమ్మ సన్నిధిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

విజయవాడలో కనకదుర్గమ్మ అమ్మవారిని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, వైకాపా నాయకులు నజీర్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐ సస్పెన్షన్ ఎత్తివేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

సుండి పెంటలోని రెండవ పట్టణ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న నవీన్ బాబు, ముగ్గురు కానిస్టేబుల్‌లపై సస్పెన్షన్ ఆర్డర్‌ను ఎత్తి వేయాలని శుక్రవారము సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు,సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. చిన్న మారన్న ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సుండి పెంట గ్రామంలో ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీలు నివసిస్తున్నారని గ్రామంలో నిజాయితీగా విధుల పట్ల అంకిత భావంతో ప్రజల పక్షాన నిజాయితీగా పని చేస్తున్నటువంటి పోలీసు ఎస్సై, కానిస్టేబుల్‌లపై సస్పెండ్ నిర్ణయంపై మరొకసారి పునరా ఆలోచన చేసి విధులు నిర్వర్తించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. శ్రీశైలం పుణ్యక్షేత్రం వచ్చు విఐపి భద్రత,స్థానిక ప్రజల యోగక్షేమాలు,నిరంతరం ప్రోటోకాల్ దృష్ట్యా అవసరమైన మేరకు పోలీసు సిబ్బంది లేకపోయినప్పటికీ కేసుల విచారణలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టే పరిస్థితి ఇక్కడ ఉందన్నారు. వాస్తవంగా ఎవరైతే తప్పు చేశారో వారిపై సమగ్ర విచారణ జరిపించి నిజాయితీ గల పోలీస్ అధికారులను కాపాడాలని జిల్లా ఉన్నతాధికారులను కార్మిక సంఘాల తరఫున కోరుతున్నామన్నారు .

ముగిసిన జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

గత రెండు రోజులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందికొట్కూరు క్రీడామైదానంలో జరుగుతున్న జగనన్న క్రీడా సంబరాల ఏపీ సీఎం ప్రైజ్ మనీ టోర్నమెంట్‌లో భాగంగా నందికొట్కూరు నియోజకవర్గ క్రీడా ఎంపికలు ముగిసాయి. ముందుగా ఉదయం క్రికెట్ సెలక్షన్స్‌ను క్రీడల కన్వీనర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ, నియోజకవర్గ క్రీడా ఎంపికల నిర్వహణ కమిటీ సభ్యులు సూది రెడ్డి రమేష్ రెడ్డి, మాధవరం బాబు, రాగన్న రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నుండి దాదాపు 180 మంది క్రీడాకారులు ఈ సెలక్షన్స్ లో పాల్గొన్నారు. వీరిలో నుండి నియోజకవర్గ క్రికెట్ జట్టును నిర్వాహకులు ఎంపిక చేశారు. కౌన్సిలర్లు లాలూ ప్రసాద్, ఉస్మాన్ బేగ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రియాజ్, డోరతి, స్వరూప, వీరన్న, శ్రీనివాసులు, ముస్తాహిర్ సీనియర్ క్రికెట్ క్రీడాకారులు బషీర్, ప్రదీప్, చరణ్ తేజ, నాయకులు పాల్గొన్నారు.

బీసీ ఇందిరా ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బనగానపల్లె

నియోజకవర్గ పరిధిలోని సంజామల మండలం ఆల్వ కొండ గ్రామానికి చెందిన కొత్తపేట హుస్సేన్ వలి గారి తండ్రి కొత్తపేట చిన్న హుస్సేన్ సాహెబ్ చికిత్స నిమిత్తం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి నివాసంలో సంజామల మండలం ఆల్వ కొండ గ్రామానికి చెందిన కొత్తపేట హుస్సేన్ వలి గారి తండ్రి కొత్తపేట చిన్న హుస్సేన్ సాహెబ్ బ్రెయిన్ స్ట్రోక్ తో హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటుండగా విషయం తెలుసుకుని బీసీ ఇందిరా వారికి ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి అవుకు

అయ్యప్ప స్వామి మాలదారులు అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి గ్రామోత్సవం సందర్భంగా పట్టణంలోని మెట్టుపల్లి దారిలో ఉన్న సుద్ద కొండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంకాలం కోటా వీధిలోని చెన్నకేశవ స్వామి ఆలయం నుండి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణంలోని తేరు వీధి, రాజా వీధి, సెంటరు ,మండపం వీధి, చాకలిపేట, బస్టాండ్ మీదుగా అయ్యప్ప స్వామి ఆలయం కు చేరుకుంది. గ్రామోత్సవం వెంట దాదాపుగా వందమంది అమ్మాయిలు దీపాలను వెలిగించుకుని నడవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాజ వంశీయులు నంద్యాల త్రివిక్రమ వర్మ, టైలర్ సుబ్బయ్య, రామాంజి, వెంకటేష్, వెంకట రాముడు, హరి, రమణ, శీను, వెంకటయ్య ,సద్దల రమణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దీపోత్సవంలో బిసి దంపతులు

బనగానపల్లె : పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో అలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టణ ంలోని ప్రధాన వీధుల వెంట అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు బిక్ష



బనగానపల్లె రూరల్ : పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానం లో శుక్రవారం అయ్యప్ప స్వామి దీక్షలు తీసుకున్న వారికి కాటసాని ప్రసాద్ రెడ్డి కాటసాని తిరుపాల్ రెడ్డి శుక్రవారం బిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గణపతి పూజ, అయ్యప్ప స్వామికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయింత్రం పట్టణంలోని ప్రధాన వీధుల వెంట అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మాల ధరించిన అయ్యప్ప స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారస్తుల సంక్షేమం కోసం కృషి : డాక్టర్ రవి కష్ణ

నంద్యాల : చిన్న వార్యపారస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తాతని డాక్టర్ రవి కృష్ణ అన్నారు. నంద్యాల చిరు వ్యాపారస్తుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా చిరు వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం డాక్టర్ రవి కృష్ణను అభినందించారు.
ఈ సందర్భంగా డాక్టర్ రవి కష్ణ మాట్లాడుతూ చిరు వ్యాపారస్తుల సంక్షేమ సంఘం కోసం కషిని కొనసాగిస్తామని వారి సమస్యల పరిష్కారానికి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి ల సహకారంతో అండగా నిలబడతామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా జగనన్న తోడు పథకం చిరు వ్యాపారస్తులకి ఎంతో మేలు చేస్తున్నదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నంద్యాల చిరు వ్యాపారస్తుల సంక్షేమ సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా మాట్లాడుతూ డాక్టర్ రవి కష్ణ తమ సంఘం సమస్యల కోసం కషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చిరు వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా,ఉపాధ్యక్షులు అజీజ్,జాయింట్ సెక్రెటరీ వెంకటరమణ,కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి,మహేష్, గుర్రప్ప, షేక్ పాషా,షేక్ అలీమ్, కుల్లాయి రెడ్డి, షేక్ యూనస్,షేక్ జిలానీ,రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారము గ్రంథాలయాధికారి ఎస్ .రాధా బాయి అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాటశాల వేదికగా విద్యార్థిని విద్యార్థులకు "గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు" అను అంశం పై వ్యాసరచన, పోటీలను "పర్యావరణం వాతావరణ మార్పులు (గ్లోబెల్ వార్మింగ్)" అను అంశం పై చిత్రలేఖనం పోటీ, "స్త్రీ మహిళా సాధికారత" అను అంశం పై వక్రుత్వపు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలా సిబ్బంది ఉపాధ్యాయులు జి. పరిమళ దేవి, జి. మాధవి, డి. శ్రీ లక్ష్మి, బి. సుకన్య, విమలమ్మ రామిజా బి, రానెమ్మ, శ్రీకళ , ఈశ్వరి, సుజాత, దుర్గాదేవి, గ్రంథాలయ సిబ్బంది రికార్డ్ అసిస్టెంట్ శ్రీధర్ పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్ .రాధా బాయి మాట్లాడుతూ ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 20న వారోత్సవాల ముగింపు రోజు అతిథుల చేత బహుమతులను అందచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాలా హెడ్ మాస్టర్ జి. పరిమళ దేవి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడు తూ గ్రంథాలయాల ఆవశ్యకతను, నిత్య జీవితంలో గ్రంథాలయాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. **పాములపాడు :** గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి వారోత్సవాల ముగింపు వేడుకల్లో బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు నిజాముద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు. **వెలుగోడు :** గ్రంథాలయ శాఖ అధికారి సుమలత ఆధ్వర్యంలో స్థానిక లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ శివరామిరెడ్డి, లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం ఎఫ్ ఇమ్మానియేల్, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, సిఐటియు మండల ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రామదాసు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విజేతలకు ఈనెల 20వ తేదీన ప్రధానం చేస్తుయడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి సుమలత తెలిపారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కరోనాపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు 20వ తేదీ బహుమతి ప్రధానం ఉంటుందని గ్రంథాల అధికారి పేర్కొన్నారు. **గోస్పాడు :** గ్రంథాలయ వార్షికోత్సవ సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్ నందు గ్రంథాల అధికారి వజ్రాల భవాని ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. **చాగలమర్రి :** పట్టణంలోని భారతీవిద్యామందిరం పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయ అధికారి రామచంద్రుడు విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాదు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఇన్చార్జ్ పి. రామదాసు పర్యవేక్షణలో చిత్రలేఖనం ,వ్యాసరచన, క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, నీరజ, శివలక్ష్మి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు. జగన్ పాల్గొన్నారు.



చాగలమర్రి : పోటీలు నిర్వహిస్తున్న జెవివి నేతలు, ఉపాధ్యాయులు



పాములపాడు: పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

అర్చకుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటపాటి పి శ్రీనివాసాచార్యులు

ప్రజాశక్తి - శిరివెళ్ల

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అర్చకుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించి ప్రత్యేక ప్రభుత్వ గెజిట్లు విడుదల చేసిందనీ రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కోటపాటి పి శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో శుక్రవారం జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చక సమాఖ్య ప్రతినిధులు, సభ్యులు, గ్రీవెన్స్ సెల్ ప్రతినిధులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాసాచార్యులను పట్టు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసచార్యులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి అర్చకుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం వల్ల నేటికీ అర్చకుల సమస్యలపై స్పందించి ప్రత్యేక జీవోలు విడుదల చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన విధంగానే జీవోలను అమలుపరిచేం దుకు డిసెంబర్ నెలలో రాష్ట్రవ్యాప్త అర్చక సమాఖ్య బహిరంగ సభను నంద్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క అర్చకుడికి అన్యాయం జరగకుండా ఏపీ అర్చక సమాఖ్య ఎల్లవేళలా అండగా ఉంటూ న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం కర్నూలు , నంద్యాల జిల్లాల వ్యాప్తంగా గ్రీవెన్స్ సెల్ ప్రతినిదులు గా పూజారి తిరుమలయ్య, మరియు నీలకంఠం పార్థుడులను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈనెల 28వ తేదీ నంద్యాల మరియు కర్నూలు జిల్లాల వ్యాప్తంగా ఉన్నటువంటి అర్చకులు తమ తమ సమస్యలపై లిఖితపూర్వకంగా గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు అందజేయవచ్చని ప్రతి ఒక్కరూ ప్రత్యేక గ్రీవెన్స్ సద్వినియోగం చేసుకోవాలని పి శ్రీనివాసాచార్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉలిందకొం డ కేశవయ్య, కె చిన్న కేశవరావు, ఎద్దు పెంట నరసింహయ్య, ఎం రంగస్వామి, ఇతర అర్చక సమైక్య సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటపాటి పి శ్రీనివాసాచార్యులు

గ్రామ దేవతకు వెండి ముఖాల విరాళం

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని గ్రామ శివారులో ఉన్న వనంలో గ్రామ దేవత వసుదేవమ్మ అమ్మవారికి దాదాపు 40 వేల రూపాయలు విలువచేసే వెండి ముఖాలము అమ్మవారికి కీర్తి శేషులు, మాజీ సర్పంచ్ తువ్వా వెంకట రమణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ముఖాలన్నీ విరాళంగా ఇచ్చారు. ధర్మపత్ని తువ్వా వెంకట రమణమ్మ, వారి కుమారులు తువ్వా వెంకట నాగిరెడ్డి, తువ్వా రామ నాగేశ్వర రెడ్డి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ముఖాలన్నీ విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయాలలో అమ్మవారికి వెండి ముఖాలం లేనందున వారు విలాలంగా సమర్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి మండల కన్వీనర్ లోకేష్ రెడ్డి, అయ్యప్ప రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వెండి ముఖాలను విరాళం అందజేస్తున్న దృశ్యం

టంగుటూరి శీనయ్యను పరామర్శించిన బీసీ దంపతులు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణానికి చెందిన టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి రాష్ట్ర థాయ్ బాక్సింగ్ చైర్మన్ బీసీ ఇందిరాలు పరామర్శించారు. టంగుటూరి శీనయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స చేయించుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటు ండగా శుక్రవారం నాడు వారు పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



టంగుటూరి శీనయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ దంపతులు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలి : సిపిఎం

గోస్పాడు : మండలంలో ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని, విద్యార్థులకు భోజనం పెట్టాలని సిపిఎం మండల కార్యదర్శి చెన్నయ్య ఎంపీడీవోకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వీరభద్రుడు, నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి దే రెడ్డి చిన్న సంజీవ రెడ్డి

అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి : ఎంపిపి

బండి ఆత్మకూర్ : బండి ఆత్మకూరు మండలాన్ని ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తామని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన అధ్యక్ష ఉపన్యాసం లో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు సంఘటితంగా పనిచేసే మండలాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. సుదీర్ఘకాల సమస్య బండి ఆత్మకూర్ కొత్త కొట్టాల కాలనీ డ్రైనేజ్ సమస్యను త్వరలోనే సమస్య పరిష్కారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీనరసింహ తెలిపారు. ఎర్రగుంట్ల ఎంపిటిసి కే బాలన్న తమ గ్రామంలో బోరు వేయాలని కోరగా ప్రస్తుతం బోర్లు వేయడం గ్రామపంచాయతీ ద్వారానే ఉంటుందని తెలిపారు. బండి ఆత్మకూరు ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ నాగరాజు తమ వైద్యశాలకు రెండు నెలల నుండి మందులు రావడంలేదని ఎంపీపీ డి సంజీవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గత సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యలను దాదాపు అన్ని సమస్యలు పరిష్కరించడం జరిగిందని ఎంపీడీవో వాసుదేవ గుప్తా ఈ సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యలను వచ్చే సర్వసభ్య సమావేశానికి పరిష్కరించి సభలో ప్రవేశపెడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తులసమ్మ, తాసిల్దార్ ఉమారాణి, ఎంఈఓ అయూబ్ బాష, ఎంఈఓ కరిముల్లా, ఎఫ్ఎస్ఓ రవీంద్ర నాయక్, హౌసింగ్ సుంకిరెడ్డి, ఈవోఆర్‌డి శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.